క్లుప్తంగా

హరీశ్‌రావును కలిసిన నాయకులు



హరీశ్‌రావుతో సిద్దిపేట నాయకులు

సిద్దిపేటజోన్: మాజీ మంత్రి హరీశ్‌రావును బుధవారం సిద్దిపేట నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. హైదరాబాద్‌లో ఆయనను కలిసి సిద్దిపేట ఎమ్మెల్యేగా ఏడో సారి భారీ మెజార్టీతో గెలుపొందిన నేపథ్యంలో అభినందించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, భీమసేన, రాములు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల రెవెన్యూ డివిజన్‌కు సహకరించండి



కూనంనేనికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీపీఐ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): నూతనంగా ఎన్నికైన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును బుధవారం హైదరాబాద్‌లో అందె అశోక్ ఆధ్వర్యంలో చేర్యాల సీపీఐ నాయకులు కలిశారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ అంశంపై ఆయనతో చర్చించారు. ఈవిషయమై ఎమ్మెల్యే కూనంనేని ప్రభుత్వంతో చర్చించి అసెంబ్లీలో మాట్లాడుతానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఈరి భూమయ్య, జంగిలి యాదగిరి, కత్తుల భాస్కర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



పొన్నం ప్రభాకర్‌తో కాంగ్రెస్ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌ను బుధవారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ హైదరాబాద్‌లో కలిశారు. ఈసందర్భంగా జిల్లాలో అభివృద్ధిలో వెనుకబడిన గ్రామాలు, మండలాలు, పట్టణాలను అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గయాజుద్దీన్, జిల్లా ఎన్‌ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ తదితరులు పాల్గొన్నారు.

కాలువపై రాజకీయాలు తగదు

బెజ్జంకి(సిద్దిపేట): రైతులకు సాగు నీరందించేందుకు నిర్మించిన కాలువలపై కాంగ్రెస్ నాయకులు రాజకీయాలు చేయడం తగదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి అన్నారు. బెజ్జంకిలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. గుండారం రైతుల నుంచి సేకరించిన భూములకు పరిహారమిచ్చి జిల్లా చివరి వరకు కాలువ నిర్మాణ పనులు జరిగాయన్నారు. అధికారంలోకి రాగానే విమర్శలు, బెదిరింపులు, దాడులు సరికావన్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మణ్, శ్రీనివాస్‌గుప్త, తిరుపతి, మహేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్లు రమేష్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయినాపూర్ సర్పంచ్ రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): సీపీఎం మద్దతుతో గెలిచి కాంగ్రెస్‌లో చేరిన అయినాపూర్ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి రాజీనామా చేయాలని సీపీఎం నాయకుడు తేలు ఇస్తారి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. రమణారెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని తీర్మానించారు. సమావేశంలో కర్రోల్ల ఎల్లయ్య, కానుగుల రాజు, సున్నం యాదగిరి, పాశం చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు. అయితే ఇదే విషయమై సర్పంచ్ చెరుకు రమణారెడ్డి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి సర్పంచ్‌గా గెలుపొందానని.. సీపీఎం నాయకులు రాజీనామా చేయాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. చిన్ననాటి నుంచి సీపీఎం కార్యకర్తగా ఉండి భూములు అమ్ముకుని ప్రజలకు సేవ చేశానని గుర్తుచేశారు.

చిరస్మరణీయుడు అంబేద్కర్



గజ్వేల్‌లో టీపొడర్‌తో అంబేద్కర్ రూపాన్ని చిత్రించిన రామకోటి రామరాజు



హుస్నాబాద్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



చిన్నకోడూరులో..

గజ్వేల్‌రూరల్/హుస్నాబాద్/దుబ్బాక/చిన్నకోడూరు(సిద్దిపేట)/తొగుట/బెజ్జంకి/ నంగునూరు/ సిద్దిపేటకమాన్/అక్కన్నపేట: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా వివిధ పార్టీల నాయకులు, దళిత, ప్రజా, యువజన సంఘాల ప్రతినిధులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గజ్వేల్‌లో జరిగిన కార్యక్రమంలో మోహనగారి రాజు, సర్దార్‌ఖాన్, మన్నె కృపానందం, పొన్నాల కుమార్, ఏగొండస్వామి, తుమ్మ శ్రీనివాస్, నీరుడి స్వామి, శివకుమార్, బ్యాగరి వేణు తదితరులు పాల్గొన్నారు.

- హుస్నాబాద్ పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య నివాళులు అర్పించారు. అలాగే పట్టణంలోని అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో సీపీఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, నాయకులు ఎండీ హుస్సేన్, వల్లపు రాజు, వెన్న రాజు, కిష్టస్వామి, కుమార్, బిక్యా నాయక్, శ్రీకాంత్, కొయ్యడ కొమురయ్య, సంజీవరెడ్డి, రాజ్‌కుమార్, కుమారస్వామి పాల్గొన్నారు.
- దుబ్బాక పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆస యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.
- తొగుట మండలంలోని పలు గ్రామాల్లో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ లతా నరేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు కొండల్‌రెడ్డి, గోవర్దన్‌రెడ్డి, ఎల్లం, మల్లయ్య, చంద్రం, నర్సింలు చాదవ్, ఎంపీటీసీలు స్వామి, లలిత, మండల కో ఆప్షన్ సభ్యుడు కలీముద్దీన్, ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, వైస్ చైర్మన్ రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.
- బెజ్జంకిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, సర్పంచ్ మంజుల, మాజీ ఎంపీపీ దామోదర్, ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు సంజీవరెడ్డి, మహిపాల్‌రెడ్డి, రత్నాకరెడ్డి, మధు, తదితరులు పాల్గొన్నారు.
- నంగునూరు మండలంలోని నంగునూరు, పాలమాకుల, నర్మేట, రాజగోపాల్‌పేట, ముండ్రాయి, రాంపూర్ గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అంబేద్కర్ సంఘం సభ్యులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.
- సిద్దిపేట పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్యాదరి రామస్వామి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. సిద్దిపేట కోర్టులో న్యాయవాదులు అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.
- అక్కన్నపేట మండల కేంద్రంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి తొందూరు ఎల్లయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిల్లయ్య, టౌన్ అధ్యక్షుడు చింతాల మల్లారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.
- జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్, జగదేవ్‌పూర్ గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు నాయకులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.
- మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి మండలంతో పాటు అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలో అంబేద్కర్ వర్ధంతిని పలు యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. అందెలో సీసీసీ (కేరింగ్ సిటిజెన్ కలెక్టివ్) ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో సీసీసీ జిల్లా కో ఆర్డినేటర్ సూకూరి ప్రవీణ్, మాల మహానాడు దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి మానేరు నాగరాజు, మండల అధ్యక్షుడు సంతోష్, నాయకులు పాల్గొన్నారు.
- మర్కూక్(గజ్వేల్): అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచ్ ఎర్రబాగు అశోక్, సామాజిక కార్యకర్త బాలకృష్ణగౌడ్, మహనీయుల ఉత్సవ కమిటీ సభ్యులు జాలని యాదగిరి అన్నారు. మండలంలోని చేబర్తి, పాములపర్తి గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వామి, కనకరాజు, కృష్ణ, శేఖర్, మల్లేశం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.
- దుబ్బాకటౌన్: ప్రపంచంలో గొప్ప మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని మాజీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. బుధవారం దుబ్బాకలోని తన నివాసంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలేష్‌గౌడ్, సుభాష్‌రెడ్డి, ప్రవీణ్, రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుల వివక్షపై అంబేద్కర్ పోరాటం

- దౌల్తాబాద్(దుబ్బాక)/కొండపాక(గజ్వేల్): కుల వివక్షపై అంబేద్కర్ అలుపెరుగని పోరాటం చేశారని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యువత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పడాల రాములు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండారు లాలు, దౌల్తాబాద్ మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్, భద్రయ్య, రాజు, మల్లారెడ్డి పాల్గొన్నారు.
- కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కిరణ్‌కుమార్‌చారి, కందూరి కనకవ్వ, మల్లమారి రవీందర్, గూడెపు లక్ష్మారెడ్డి జయంతి, మహిపాల్ పాల్గొన్నారు.



అక్కన్నపేట మండల కేంద్రంలో..



తిగుల్‌లో..



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

ఆహ్వానం



కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందిస్తున్న నిర్వాహకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్ గ్రామంలో నెలకొల్పనున్న శ్రీ గురుపీఠం శిలాన్యాసంకు హాజరు కావాలని బుధవారం పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. శ్రీ గురుపీఠం వ్యవస్థాపకులు శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిలతో పాటు పలువురిని కలిసి ఆహ్వానించారు. గురువారం శ్రీ గురుపీఠం శిలాన్యాసం నిర్వహిస్తున్నట్లు శివకుమార్‌గౌడ్ తెలిపారు. అందుకు సంబంధించి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో బగలాముఖీ ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ, శ్రీ గురుపీఠం ట్రస్టు సభ్యులు మోహన్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, తదితరులు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన వ్యక్తిపై అతడి మేనబావ ఫిర్యాదు చేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన రాములు అతడి బామ్మర్ది సునందు(23) ఇరువురు కలిసి బతుకుదెరువు కోసం అమీన్‌పూర్ పరిధిలోని బంధంకొమ్ముకు ఐదేళ్ల క్రితం వచ్చి మదినగూడ పరిధిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 3వ తేదీన రాములు డ్యూటీకి వెళ్లగా సునందు ఇంటి వద్దే ఉన్నాడు. అదే రోజు సాయంత్రం రాములు ఇంటికి వచ్చి చూసేసరికి సునందు కనిపించకపోవడంతో సునందు కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. సునంద్ అదృశ్యంపై అతడి మేనబావ రాములు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైతు ఆగ్రో సేవా కేంద్రం తనిఖీ

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఫర్టిలైజర్ దుకాణాల్లో ప్రభుత్వ అనుమతులు ఉన్న ఎరువులు, విత్తనాలనే విక్రయించాలని, నకిలీ విత్తనాలు అమ్మితే చర్య తప్పదని మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రమైన చిలప్‌చెడ్‌లోని రైతు ఆగ్రో సేవా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని విత్తనాలు, తదితర స్టాక్ పరిశీలించడంతో పాటు, రికార్డులు తనిఖీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భూపాల్, రైతు ఆగ్రో సేవా కేంద్రం నిర్వాహకుడు శ్రీనివాస్ ఉన్నారు.

వర్షానికి తడిసిన ధాన్యం



మద్దూరు(హుస్నాబాద్): మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి పలు చోట్ల ధాన్యం తడిసింది. ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

దుబ్బాకరూరల్: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం వర్షానికి తడిసి ముద్దయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసింది. దీంతో చేసేదేమి లేక రైతులు బిక్కు బిక్కుమంటున్నారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ సర్పంచ్



కిష్టయ్యను పార్టీలోకి ఆహ్వానిస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): అసెంబ్లీ ఎన్నికల తర్వాత తెలంగాణ హస్తగతమైన నేపథ్యంలో మండల పరిధిలోని అల్వాల సర్పంచ్ బీఆర్‌ఎస్ పార్టీకి షాకిచ్చారు. పలువురు అనుచరులతో కలిసి కాంగ్రెస్ గూటికి చేరారు. దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో అల్వాల సర్పంచ్ ఎనగంటి కిష్టయ్య బుధవారం కాంగ్రెస్‌లో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ హయాంలో మాజీ మంత్రి, స్వర్గీయ చెరుకు ముత్యంరెడ్డి చేసిన అభివృద్ధి తప్ప బీఆర్‌ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలతో నియోజకవర్గానికి ఒరిగిందేమీ లేదన్నారు. ప్రస్తుతం నూతనంగా ఏర్పాటవుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పల్లెలు అభివృద్ధి చెందుతాయన్న ఉద్దేశ్యంతోనే తాను బీఆర్‌ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు.

ఉచిత శిక్షణ

కౌడిపల్లి(నర్సాపూర్): మహిళలకు స్వయం ఉపాధి కోసం బ్యూటీ పార్లర్ కోర్స్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మండల ఐకేపీ ఏపీఎం సంగమేశ్వర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టేట్‌బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం సంగారెడ్డిలో నెలరోజుల పాటు మహిళలకు బ్యూటీ పార్లర్ కోర్స్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నారని అన్నారు. మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన 18 నుంచి 45ఏళ్ల లోపు మహిళలకు అర్హులని తెలిపారు. ఈనెల 15 నుంచి వచ్చే నెల 13 వరకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బ్యూటీపార్లర్ టూల్ కిట్ అందజేస్తామన్నారు. ఉత్సాహం ఉన్నవారు రేషన్, ఆధార్ కార్డు, పదవ తరగతి మెమో బ్యాంక్ అకౌంట జిరాక్స్ పత్రాలతో పాటు నాలుగు పాస్‌ఫొటోలతో ఈనెల 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 97044 46956, 94901 29839 సంప్రదించాలని చెప్పారు.

విద్యుత్ మీటర్ల తనిఖీ

నిజాంపేట(మెదక్): మండల కేంద్రం నిజాంపేటలో విద్యుత్‌శాఖ అధికారులు బుధవారం 13 బృందాలుగా ఏర్పడి గ్రామంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఇంటింటికీ ఉన్న విద్యుత్ మీటర్లను తనిఖీ చేశారు. అనధికార విద్యుత్ వినియోగం చేసినట్లయితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

◆ ఉద్యమ ఆకాంక్ష నెరవేర్చాలి

నంగునూరు(సిద్దిపేట): కొత్తగా ఏర్పాటు కానున్న ప్రభుత్వం విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు నిరుద్యోగులు, యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శనిగరం కనకయ్య కోరారు. బుధవారం నర్మేటలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కోసం ఎంతో మంది కృషి చేశారని, వారి ఆకాంక్షను నెరవేర్చాలన్నారు.

◆ కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

తొగుట(దుబ్బాక): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీపీ లతా నరేందర్‌రెడ్డి కల్యాణలక్ష్మి చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ అశోక్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

◆ వాటర్ క్యాన్‌ల వితరణ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని ముత్తన్నపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు బుధవారం భీమ్ వారియర్స్ రాజ్‌కుమార్ తదితరులు వాటర్ క్యాన్లు వితరణ చేశారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి మహతి లక్ష్మి, హెచ్ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ న్యాయవాదుల హర్షం

సిద్దిపేటకమాన్: ముఖ్యమంత్రిగా రేవంతిరెడ్డిని ప్రకటించడంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సిద్దిపేట బార్ అసోసియేషన్ భవనంలో బుధవారం స్వీట్లు పంపిణీ చేశారు.

◆ బియ్యం అందజేత

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నిరుపేద వేముల మల్లవ్వ కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం పరామర్శించి 75 కిలోల బియ్యాన్ని అందించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, ఉప సర్పంచ్ ముక్కపల్లి కనకయ్య, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చందపురం మల్లేశం, టౌన్ ప్రెసిడెంట్ ధర్మారం బాబు, నాయకులు కనకయ్య, మల్లయ్య, ఎల్లయ్య, రాజు, కాస కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ పొన్నంకు ఉపముఖ్యమంత్రి ఇవ్వాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని బుధవారం మండలంలోని చాపగానీ తండా గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు మాలోతు శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పాండ్రాల దాము మాట్లాడుతూ.. కాంగ్రెస్ సుభిక్ష పాలన రాబోతుందని అన్నారు.

◆ నేటి నుంచి దర్గా ఉత్సవాలు

మనూరు(నారాయణఖేడ్): మండల కేంద్రంలోని హజ్రత్ సయ్యద్ షాదుల్లా హుస్సేని దర్గా ఉర్సు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రతీ హామీని నెరవేరుస్తాం

• పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్



మాట్లాడుతున్న పీసీసీ సభ్యుడు కిషన్

రేగోడ్(మెదక్): ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామని పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, జెడ్పీటీసీ సభ్యుడు యాదగిరి అన్నారు. మండల కేంద్రం రేగోడ్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదేళ్ల కష్టానికి ప్రతి ఫలంగా తీర్పు వచ్చిందని, ఇది ప్రజా విజయమని తెలిపారు. దామోదర రాజనర్సింహను భారీ మెజార్టీతో గెలిపించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దిగంబర్‌రావు నేతృత్వంలో అంత సమష్టిగా పని చేయడం వలన అన్ని గ్రామాల్లో మెజార్టీ వచ్చిందని చెప్పారు. ఇక అభివృద్ధే తమ లక్ష్యమని, ప్రజల మధ్యన ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు చోటుమియా, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాధకిషన్, మాజీ సర్పంచ్ విజయభాస్కర్, మాజీ ఎంపీటీసీ నరేందర్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వాడకం పెంచండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న కంపెనీ ప్రతినిధులు

కొల్చారం(నర్సాపూర్): రసాయన ఎరువుల నుంచి భూమిని కాపాడడం ద్వారా మానవాళికి మేలు కలుగుతుందని ఎస్ఎంసీ కంపెనీ ప్రతినిధి సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో మండల వ్యవసాయ శాఖ సౌజన్యంతో ప్రపంచ మృతిక దినోత్సవాన్ని నిర్వహించారు. భూ సారాన్ని పెంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా భూమిలో సారం పెరిగి పంట దిగుబడికి ఎక్కువ అవకాశాలు ఉంటాయన్నారు. రసాయన ఎరువులు మృత్తికలోని సహజత్వాన్ని కోల్పోయేలా చేయడంతో పాటు పంట దిగుబడులపై ప్రభావాన్ని చూపుతాయన్నారు. రైతులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పంట సాగులో సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలన్నారు. పంటల దిగుబడికి అవసరమైన సూచనలు ఇచ్చారు. ఈ సదస్సులో ఏఈఓ ప్రతిభ, రైతులు పాల్గొన్నారు.

సమస్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



శిక్షణలో ఉపాధ్యాయులు

మనోహరాబాద్(తూప్రాన్): ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన పాఠశాల మౌలిక సదుపాయల వివరాలను యూడైస్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని నోడల్ అధికారి వెంకటస్వామి అన్నారు. బుధవారం మండలం కాళ్లకల్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. మండల ఉపాధ్యాయులకు రిసోర్స్ పర్సన్‌లతో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ.. తమ పాఠశాలలకు సంబంధించిన మౌలిక వసతులను, సమస్యలను, విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో ఈ నెల 12లోపు నమోదు చేయాలన్నారు. నమోదు ఆధారంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.